క్లుప్తంగా

లక్ష్మీదేవిపల్లి ఎంపీడీఓగా అంకుబాబు



కొత్తగూడెంఅర్బన్: లక్ష్మీదేవిపల్లి ఎంపీడీఓగా మంగళవారం అంకుబాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీఓగా పనిచేసిన చలపతిరావు ఖమ్మంకు బదిలీ కావడంతో కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పని చేసే అంకుబాబుకు ఎంపీడీఓగా అదనపు బాధ్యతలు అప్పగించారు.

వెంగన్నపాలెం వాసికి దళితరత్న అవార్డు


దేవరకొండ కిరణ్

జూలూరుపాడు: మండలంలోని వెంగన్నపాలెంకు చెందిన దేవరకొండ కిరణ్‌కు దళితరత్న అవార్డు లభించింది. హైదరాబాద్ రవీంద్ర భారతిలో అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఆయన అవార్డు స్వీకరించారు. పీజీ పూర్తి చేసిన కిరణ్ దండోరా ఉద్యమంలో పాల్గొనగా.. అవార్డు అందుకోవడం సంతోషంగా ఉందని.. తనకు సహకరించిన తెలంగాణ మాదిగ హక్కుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు కొరిపల్లి శ్రీనివాస్ తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు.

నివాళి..


అంతిమయాత్రలో నాయకులు

సింగరేణి(కొత్తగూడెం): రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన కాంట్రాక్ట్ కార్మికుల పరిరక్షణ సంఘం అధ్యక్షులు, టీబీజీకెఎస్ నాయకులు రాసూరి శంకర్‌కు కాంట్రాక్ట్ కార్మిక సంఘాల నాయకులు, అధికారులు, ఉద్యోగులు, కార్మికులు, నాయకులు మంగళవారం ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం అంతిమయాత్రలో పాల్గొని పాడె మోశారు. ఐఎన్‌టీయూసీ కేంద్ర కమిటీ సీనియర్ ఉపాధ్యక్షులు త్యాగరాజన్, ఏరియా ఉపాధ్యక్షుడు రజాక్, కార్పొరేట్ ప్రెసిడెంట్ పీతాంబరం రాజేశ్వరరావు, ఎస్‌కె.గౌస్, చిలక రాజయ్య, సకినాల సమ్మయ్య, భారతరత్న అంబేడ్కర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు మద్దెల శివకుమార్, నాయకులు పెద్దబోయిన సతీష్, యాకూబ్ షావలి, చంద్రశేఖర్, గోపాలరావు తదితరులు ఉన్నారు.

ఈఓగా రజినీకుమారికి అదనపు బాధ్యతలు

పాల్వంచరూరల్: పెనుబల్లిలోని శ్రీ నీలాద్రీశ్వర ఆలయ(శివాలయం) ఇన్‌చార్జ్ ఈఓగా ఎన్.రజనీకుమారికి బాధ్యతలు అప్పగించారు. ఆలయ ఈఓగా ఉన్న పీ.వీ.రమణను అన్నపురెడ్డిపల్లిలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి బదిలీ చేశారు. దీంతో పాల్వంచ మండలం పెద్దమ్మతల్లి ఆలయ ఈఓ రజనీకుమారికి నీలాద్రీశ్వర ఈఓగా అదనపు బాధ్యతలు అప్పగించగా, మంగళవారం ఆమె విధుల్లో చేరారు.

కార్మికులను బదిలీ చేయాలి

పాల్వంచ: టీజీజెన్‌కోలోని వివిధ స్టేషన్ల నుంచి వైటీపీఎస్‌కు బదిలీ అయిన కార్మికులను తిరిగి వారి పేరెంట్ యూనిట్లకు బదిలీ చేయాలని తెలంగాణా రాష్ట్ర విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చారుగుండ్ల రమేష్ అన్నారు. ఈ మేరకు మంగళవారం విద్యుత్ సౌధలని సీఎండీ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. కేటీపీఎస్, బీటీపీఎస్‌లో కార్మికుల కొరత తీవ్రంగా ఉందని, ఈ విషయాన్ని సీఈలు గతంలో జెన్‌కో యాజమాన్యం దృష్టికి తీసుకొచ్చారన్నారు. అది కూడా పట్టించుకోకుండా కేటీపీఎస్, కేటీపీపీల నుంచి పెద్ద సంఖ్యలో బదిలీలు చేశారని దీంతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు.

వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

సింగరేణి(కొత్తగూడెం): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పకుండా ధరించాలని కొత్తగూడెం ఏరియా జీఎం ఎం.శాలేంరాజు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ.. ఈ మధ్యకాలంలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అత్యధికంగా సింగరేణి ఉద్యోగుల, వారి కుటుంబ సభ్యులు ప్రమాదాలకు గురయ్యారని, వీరిలో హెల్మెట్ ధరించని వారు తలకు తీవ్రగాయాలై మృతి చెందారన్నారు. అందుకని ప్రతీ ఒక్కరు హెల్మెట్ ధరించాలన్నారు. అదే విధంగా విధులకు హాజరయ్యే క్రమంలో ముందుగానే ఇంటి నుండి బయలుదేరాలని, విధులకు హాజరయ్యే సమయంలో అతివేగం సరైందికాదన్నారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. కార్మికులు చెడు వ్యసనాలు, ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్‌లకు పాల్పడకుండా ఉండాలన్నారు. విధినిర్వహణలో అధికారులు రక్షణ సూత్రాలను పాటిస్తు రక్షణతో కూడిన ఉత్పత్తి సాధించాలన్నారు.

వికృతి వనాలుగా మారుతూ..

కళ తప్పుతున్న పల్లె ప్రకృతివనాలు

- అగ్నిప్రమాదాల బారిన పడుతున్న వైనం
- అయినా పట్టింపులేనట్లుగా అధికారులు
- ప్రజలకు కరువవుతున్న ఆహ్లాదం


జూలూరుపాడు బృహత్ పల్లె ప్రకృతివనంలో అగ్నిప్రమాదంలో కాలిపోయిన మొక్కలు

జూలూరుపాడు: పచ్చదనం, ఆహ్లాదభరిత వాతావరణంలో ప్రజలు గడిపేందుకు దోహదపడతాయని ప్రభుత్వం ప్రతీ గ్రామ పంచాయతీలో ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతివనాలు కళ తప్పుతున్నాయి. ప్రతీ పంచాయతీలో ఏర్పాటు చేసిన నర్సరీలో పెంచిన మొక్కలను ప్రభుత్వ స్థలాలు, కార్యాలయాలు, విద్యాసంస్థలు, చెరువు కట్టలు, ఖాళీ స్థలాలు, రహదారుల పక్కన నాటారు. ఐదు కుంటల నుంచి ఎకరం స్థలాల్లో పల్లె ప్రకృతివనాలు, మూడు నుంచి 5 ఎకరాల స్థలంలో బృహత్ పల్లెప్రకృతి వనాలు నిర్మించారు. వనాల్లో లక్షల రూపాయలు వెచ్చించి వేలాది మొక్కలు నాటినా ప్రస్తుతం వాటి పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. రెండేళ్లుగా పల్లె ప్రకృతి వనాల సంరక్షణ విషయంలో అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో పచ్చదనం, ఆహ్లాదబరితంగా ఉండే వనాలు దారుణంగా తయారయ్యాయి. మండలంలో 24 గ్రామ పంచాయతీల్లో పల్లె ప్రకృతి వనాలు, జూలూరుపాడు, పడమటనర్సాపురం గ్రామాల్లో బృహత్ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేశారు. గత ప్రభుత్వ అధికారులు పల్లెప్రకృతి వనాలకు రాళ్లు, గుట్టలు, కొండలు, అనువుగాలేని భూములు, పల్లెలకు సుదూరంగా ఉన్న ప్రాంతాలు, అటవీ భూముల్లో ఎక్కడ పడితే అక్కడ స్థలాలు కేటాయించి చేతులు దులుపుకున్నారు. పల్లె ప్రకృతివనాలు పంచాయతీలు పర్యవేక్షించాల్సినప్పటికీ నిధులు కొరతను సాకుగా చూపుతూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లె ప్రకృతి వనాలపై దృష్టి సారించి అందుబాటులోకి తీసుకురావాలని, నాల వద్ద రక్షణ కోసం కాపాలాదారులను ఏర్పాటు చేయడం, మొక్కలు చనిపోకుండా సంరక్షించడం, వనాల చుట్టూ ఉన్న ఫెన్సింగ్‌కు మరమ్మతులు చేపట్టడం, నష్టం జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


కళావిహీనంగా మారిన గుండెపుడి పల్లె ప్రకృతివనం..

నీరు లేక ఎండిపోతూ..

వనాల్లోని మొక్కలకు నీళ్ల పట్టకపోవడం, ఎలాంటి రక్షణ, సంరక్షణ చర్యలు లేకపోవడంతో వనాల్లోని మొక్కలు ఎండిపోతున్నాయి. ఇటీవల జూలూరుపాడు బృహత్ పల్లె ప్రకృతివనం అగ్నిప్రమాదానికి గురి కావడంతో చెట్లు కాలిపోయాయి. ఆకతాయుల కారణంగా ఎండాకాలం కావడంతో ఎండిన ఆకులకు నిప్పంటుకుని సుమారు రెండు ఎకరాల్లోని అగ్నిప్రమాదంతో పెద్ద చెట్లు, మొక్కలు కాలిబూడిదయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న అధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టినప్పటికీ జరగాలిన్న నష్టం జరిగిపోయింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


వెంగన్నపాలెం ప్రకృతివనంలో..

సంరక్షణ చర్యలు తీసుకుంటున్నాం..



పల్లె ప్రకృతివనాలు, బృహత్ పల్లె ప్రకృతి వనాల సంరక్షణ, రక్షణకు చర్యలు తీసుకుంటున్నాం. ఆకతాయుల కారణంగా జూలూరుపాడు బృహత్ పల్లె ప్రకృతి వనం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదానికి గురైందని, దీంతో జీపీ సెక్రటరీలను అప్రమత్తం చేయడం జరిగింది. వనాల్లోని మొక్కలు, చెట్లు ఎండిపోకుండా పంచాయతీ కార్మికులు నీళ్లు పోస్తున్నారు. – తులసిరామ్, ఎంపీఓ, జూలూరుపాడు

బ్రిడ్జి నిర్మాణానికి రూ.20 లక్షల నిధులు


వినతిపత్రం అందజేస్తున్న పద్మావతి

ఇల్లెందు: ఇల్లెందులపాడు తాగునీటి చెరువు అలుగు వాగు మీద బ్రిడ్జి నిర్మాణానికి ఎంపీ వద్దిరాజు రవిచంద్ర రూ.20 లక్షలు నిధులు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం ఇల్లెందులో జరిగిన బీఆర్ఎస్ సభలో బ్రిడ్జి నిర్మాణంపై మాజీ కౌన్సిలర్ కటకం పద్మావతి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ.. రెండేళ్ల క్రితం అలుగు వాగు మీద చప్టా కొట్టుకుపోయిందని, వర్షాకాలంలో హిందూ శ్మశానవాటికకు మృతదేహాలను తీసుకెళ్లేందుకు చాలా ఇబ్బందవుతుందన్నారు. పాలకవర్గాన్ని అడిగితే కేవలం రూ.5 లక్షలు తాత్కాలిక ఇనుప వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించిందన్నారు. ఈ మేరకు స్పందించిన ఎంపీ వెంటనే నిధులు కేటాయిస్తున్నట్టు తెలిపారు.

చోరీల నివారణకు చర్యలు చేపట్టాలి


తనిఖీ చేస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి వ్యాప్తంగా ఉన్న గనులు, డిపార్ట్‌మెంట్ల వద్ద నిఘా పెంచి చోరీల నివారణకు చర్యలు చేపట్టటమే కాకుండా, దొంగిలించిన వస్తువులను రికవరీ చేయాలని సింగరేణి సెక్యూరిటీ జీఎం లక్ష్మీనారాయణ అన్నారు. ఈ మేరకు మంగళవారం సింగరేణి వ్యాపిత 11 ఏరియాల్లో సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎండాకాలంలో విధులు నిర్వహించే సిబ్బందికి తగిన సదుపాయాలు కల్పించాలని, ఏరియాల్లో ఉన్న స్క్రాప్‌ను తీసివేయాలని, మ్యాన్‌పవర్, కోల్ ట్రాన్స్‌పోర్ట్, ట్రక్స్ మూమెంట్, ఖాళీ స్థలాలు, ఎస్టేట్ సిబ్బంది సహకారంతో పెన్సింగ్ వేయిచాలని, క్వార్టర్లు అన్యక్రాంతం కాకుండా చర్యలు చేపట్టాలని సూచించారు.

ఐరన్ స్క్రాప్ షాపుల్లో దాడులు

కొత్తగూడెం కార్పొరేట్ పరిధిలోని వివిధ ఐరన్ స్క్రాప్ షాపుల వద్ద సింగరేణి సెక్యూరిటీ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా షాపుల్లో సింగరేణికి చెందిన మెటీరియల్ వచ్చిందనే ఆరోపణల మేరకు సిబ్బంది దాడులు నిర్వహించారు. కానీ ఏ షాపులో ఎలాంటి మెటీరియల్ లభ్యంకాలేదు. ఇదిలా ఉండగా, గనులు, డిపార్ట్‌మెంట్ వద్ద కొంత మంది సెక్యూరిటీ సిబ్బంది సహకారంతో దొంగతనాలు జరుగుతున్నప్పటికీ సిబ్బందిపై పూర్తిస్థాయిలో చర్యలు లేని కారణంగా సింగరేణిలో ఆనవాయితిగా మారిందని విమర్శలు వినిపిస్తున్నాయి.

అగ్నిమాపక వారోత్సవాలపై అవగాహన


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

కొత్తగూడెంఅర్బన్: అగ్నిమాపక వారోత్సవాలపై మంగళవారం అధికారులు, ప్రయాణికులకు అవగాహన కల్పించారు. భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్‌లో, కొత్తగూడెం బస్టాండ్‌లో ప్రయాణికులతో కలిసి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొత్తగూడెం ఫైర్ ఆఫీసర్ పుల్లయ్య మాట్లాడుతూ... వేసవిలో జరిగే అగ్ని ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదాలు జరిగితే అగ్నిమాపక స్టేషన్‌కు సమాచారం అందించాలన్నారు. కొత్తగూడెం అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవాదుల చట్టం సవరణపై నిరసన


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

కొత్తగూడెంటౌన్: అడ్వకేట్స్ (న్యాయవాదుల సవరణ బిల్లు 2025) యాక్ట్ సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఐలు నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కోర్టు ఆవరణలో యూనియన్ నాయకులు ఎంవి.ప్రసాదరావు, రమేష్‌కుమార్ మక్కడ్ ఆధ్వర్యంలో కరపత్రాలు ఆవిష్కరించి ప్రచారం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ... అడ్వకేట్స్ యాక్ట్‌కు సవరించడానికి కేంద్రప్రభుత్వం తీసుకురానున్న ప్రతిపాదిత బిల్లును వ్యతిరేకించాలన్నారు. ఈ బిల్లులో బార్ కౌన్సిల్ ప్రతిపత్తి ప్రమాదకరంగా మారుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న చట్టాన్నే కొనసాగించాలని, విదేశి లాయర్‌లను అనుమంతించవద్దన్నారు. ఈ కార్యక్రమంలో జె.శివరాంప్రసాద్, కె.పుల్లయ్య, కె.కిషన్‌రావు, పాయం రవివర్మ, బండారు అరుణ్, రావిలాల రామారావు, అరికాల రవికుమార్, మెదరమెట్ల శ్రీనివాసరావు, గౌతంకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కరెంట్ లేక.. పింఛన్ అందక..


పింఛన్ కోసం పోస్టాఫీస్‌కు వచ్చి నిరీక్షిస్తున్న వృద్ధులు

ఇల్లెందు: ఇల్లెందు పోస్టాఫీస్‌లో కరెంట్ లేక... జనరేటర్ పనిచేయక ఆన్‌లైన్‌లో అంతరాయం కారణంగా పింఛన్‌దారులు అవస్థలు పడుతున్నారు. ఈ మేరకు మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడటంతో పింఛన్ కోసం పోస్టాఫీస్‌కు వచ్చిన ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ విషయం పలువురు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అబ్దుల్ నబీ దృష్టికి తీసుకెళ్లగా ఆయన పోస్టుమాస్టర్‌తో చర్చించి పింఛన్‌దారులకు పింఛన్ అందేలా చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు తక్షణం జనరేటర్ మార్చాలని నబీ కోరారు.

సమస్యలు పరిష్కరించాలి

జూలూరుపాడు: పంచాయతీ కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.గోపాల్‌రావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జీపీ కార్మికుల సమస్యల పరిష్కారానికి ఈనెల 17న కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నాను జయప్రదం చేయాలన్నారు. పంచాయతీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి, ప్రతీ నెల ఉద్యోగుల మాదిరిగా వేతనాలు ఇవ్వాలన్నారు.

సమావేశాన్ని విజయవంతం చేయాలి

జూలూరుపాడు: మండలకేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించనున్న బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా నాయకుడు యల్లంకి సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్ ముఖ్యఅతిథిగా హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

గ్రామంలో వసతులు కల్పించాలని ధర్నా


ధర్నా నిర్వహిస్తున్న నాయకులు, గ్రామస్తులు

సుజాతనగర్: మండలంలోని సీతంపేట పంచాయతీ పరిధిలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి వీర్ల రమేష్ మాట్లాడుతూ... గ్రామంలోని పేదలు పక్కా ఇళ్లు, విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి రాఘవాపురం వరకు బీటీ రహదారిని ఏర్పాటు చేయాలన్నారు. భూక్యా శంకర్, చిలక వెంకట రామయ్య, మురిపిటి నాగయ్య, సుగుణ, శోభన్, కొమరారెడ్డి, మంగీలాల్, ఆకుల వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

‘భూభారతి’తో రెవెన్యూ సేవలు పునరుద్ధరణ


కాన్ఫరెన్స్‌లో కొత్వాల, తదితరులు

పాల్వంచరూరల్: భూ భారతి ఏర్పాటుతో గ్రామాల్లో రెవెన్యూ సేవలు పునరుద్ధరణ జరుగుతుందని మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. మండల పరిధిలోని జగన్నాథపురం రైతు వేదికలో జరిగిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమంలో అయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి భూ పరిపాలనలో నూతన అధ్యాయం ఏర్పాటు చేశారని, ఈ వ్యవస్థకు రూపకల్పన చేసిన రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి రైతులు రుణపడి ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఓ పి.శంభోశంకర్, వై.సత్యం, ఎం.సుజాత, ఎస్.అనురిక, జి.నరేష్, సొసైటీ డైరెక్టర్ చౌగని పాపారావు, నాయకులు కొండం వెంకన్న, నందనాయక్, పైడిపల్లి మహేష్, కొండంపుల్లయ్య, గంధం నర్సింహారావు, రాము, శాంతివర్ధన్, బండి నాగరాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.

వనజీవిని స్మరించుకుంటూ మొక్కలు నాటాలి


మొక్క నాటుతున్న క్లబ్ సభ్యులు

ఇల్లెందురూరల్: పద్మశ్రీ వనజీవి రామయ్యను స్మరించుకుంటూ మండలంలోని ఫారెస్టు అర్బన్ పార్క్‌లో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం విరివిగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులు మాట్లాడుతూ.. మొక్కలు నాటుతూ వాటిని సంరక్షించిన వనజీవి రామయ్యను స్మరించుకుంటూ మొక్కలు నాటాలన్నారు. రమేష్, గోవర్ధన్, బసవయ్య, సంతోష్, వీరన్న, నర్సింహారావు, శ్రీను, వెంకటేశ్వర్లు, బుచ్చయ్య పాల్గొన్నారు.

గిరిజన చట్టాలను అమలుచేయాలి

ఇల్లెందురూరల్: ఏజెన్సీ ప్రాంతాలలో గిరిజన చట్టాలను పాలకులు పకడ్బందీగా అమలుచేయాలని ఆల్ ఇండియా ట్రైబల్ ఫోరం (ఏఐటీఎఫ్) రాష్ట్ర నాయకులు చింత ఉదయ్, రజిత డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని మర్రిగూడెం గ్రామపంచాయతీలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. దేశంలో పాలకవర్గాలు ఆదివాసీలను అడవి నుంచి దూరం చేసే ప్రయత్నాలు ప్రారంభించారని, విలువైన అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు అప్పగించే కుట్రలో భాగంగానే నక్సలైట్ల పేరుతో ఆదివాసీలను అంతమొందిస్తున్నారన్నారు. ఈ మేరకు ఈనెల 23న భద్రాచలంలో నిర్వహించే జిల్లా స్థాయి సదస్సుకు ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జోగ రమేష్, మూతి హనుమంతు, ఏనుగు వసంతరావు, మూతి రామయ్య, జోగ రామనర్సయ్య, జోగ సారమ్మ, ఏనుగు పైడమ్మ, చంద్రకళ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పర్యటనలో విద్యార్థినులు


కిన్నెరసానిలో విద్యార్థినులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థినులు క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా కిన్నెరసాని జంతు పర్యాటక కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. కిన్నెరసాని ఎఫ్ఆర్ఓ, ఎఫ్ఎస్ఓ ఆఫీసర్ల సహకారంతో జింక, నక్కలు, హంసలు, బాతులు, మొసళ్లు, వివిధ జాతుల పాములను పరిశీలించి, అక్కడి చేపల పెంపకాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జంతుసంపద ఏ విధంగా రక్షించబడుతుంది, వాటి పెంపకం, పోషణ విధానాలను అధికారులు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జువాలజీ విభాగం అధ్యాపకులు కె.స్వర్ణలత, షాహిదా, పర్వీన్, ఎస్‌కె.సఫియా పాల్గొన్నారు.

కొనుగోళ్లలో జాప్యం..

కల్లాల్లో పేరుకుపోతున్న ధాన్యపు రాశులు

- కొనుగోలు కేంద్రాలే ప్రారంభించని వైనం
- నగం ధర ఇస్తూ దండుకుంటున్న దళారులు


సోములగూడెంలో ఆరబోసిన ధాన్యం


పాల్వంచరూరల్: కల్లాల్లో ధాన్యపు రాశులు రోజురోజుకు పెరుకుపోవడంతో రైతుల కళ్లల్లో కల్లోలం మొదలైంది. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో సంబంధిత అధికారులు జాప్యం చేయడంతో ధాన్యం కేంద్రాలకు పోటెత్తుతోంది. ఇదే అదునుగా భావించిన దళారులు రైతుల నుంచి సగం ధరలకు ధాన్యాన్ని కొనుగోలు చేసి దోపిడీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 4,900 ఎకరాల్లో యాసంగి వరిసాగు చేశారు. గతేడాది యాసంగిలో ఏర్పాటుచేసిన ఆరు కొనుగోలు కేంద్రాల్లో రూ.20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సొసైటీ కొనుగోలు చేయగా, ఈ ఏడాది కూడా 20 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సొసైటీ లక్ష్యంగా నిర్దేశించింది. ఈ మేరకు కల్లాల్లో, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కోసం ఎదురుచుస్తూ నిరీక్షిస్తున్నారు. సకాలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతో రైతులు కలవరం చెందుతున్నారు. అకాల వర్షం వస్తే ధాన్యం తడిసి ఎందుకు పనికిరాకుండా పోతుందని రైతులు దిగులు చెందుతున్నారు. గతేడాది ఈపాటికే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసి ధాన్యాన్ని కొనుగోలు చేయగా ఈసారి ఇంకా ఒక్క కొనుగోలు కేంద్రాన్ని కూడా ప్రారంభించలేదు.

ప్రైవేట్ వ్యాపారుల దోపిడీ..


కాంటా వేస్తున్న వ్యాపారులు

ఆయా కేంద్రాల వద్ద రైతులు వంద క్వింటాళ్ల ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు కోసం నిరీక్షిస్తున్నా సమయంలో ఇదే అదునుగా భావించిన ప్రైవేట్ వ్యాపారులు 1010 రకం ధాన్యాన్ని 77 కేజీల ధాన్యం బస్తాను రూ.1,200 చొప్పున, హెచ్ఎంటి రకం ధాన్యాన్ని రూ.1,750 చొప్పున కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలుకేంద్రం ద్వారా అయితే క్వింటా ధాన్యం కామన్‌రకం రూ.2,300 చొప్పున, గ్రేడ్ ఏ రకం ధాన్యం రూ.2,320 చొప్పున కొనుగోలు చేస్తున్నారని రైతులు తెలిపారు. ఇప్పటికైనా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి కొనుగోళ్లు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

కేంద్రాలను ప్రారంభించాలి



400 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రం వద్ద ఆరబోశాను. కొనుగోలు కేంద్రం ఏర్పాటులో జాప్యం చేయడంతో వర్షం వస్తే ధాన్యం తడిసి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. అధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించాలి.

– మొగికొట్టి శేఖర్, రైతు, సోములగూడెం

త్వరలోనే కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తాం..

మండలంలో ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలను త్వరలోనే ప్రారంభిస్తాం. అయితే ధాన్యం నిర్దేశించిన తేమశాతం లేని కారణంగా కొనుగోలు జాప్యం జరుగుతోంది. త్వరలోనే ధాన్యం కేంద్రాలను, కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

– శ్రీనివాస్, సొసైటీ కార్యదర్శి